క్లుప్తంగా

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ క్యాలెండర్ ఆవిష్కరణ

దెందులూరు: చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు నూతన సంవత్సర క్యాలెండర్లను దెందులూరు బ్యాంక్ మేనేజర్ టీ.నాగార్జున, క్యాషియర్ ఉప్పలపాటి రామకృష్ణ ఆవిష్కరించారు. దెందులూరులో గోదావరి గ్రామీణ బ్యాంక్ ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే దెందులూరుతో పాటు సమీప గ్రామాల్లో వినియోగదారులు తమ బ్రాంచి ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

బాలసదనం చిన్నారులకు దుప్పట్ల పంపిణీ

దెందులూరు: చల్లచింతలపూడికి చెందిన జై గౌడ సేన రాష్ట్ర నాయకుడు నూతి రవీందర్ గౌడ్ బుధవారం దెందులూరులో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంలో చిన్నారుకులకు దుప్పట్లు, పెన్సిళ్లు పంపిణీ పంపిణీ చేశారు. బాలసదనం సూపరింటెండెంట్ ఎస్ బేబి సరోజినీ, అకౌంటెంట్ దుర్గామల్లేశ్వరితో కలిసి రవీందర్ గౌడ్ హాస్టల్లో ఉండే చిన్నారులకు దుప్పట్లు, పెన్సిళ్లు అందజేశారు. జై గౌడ సేన సంఘం నాయకులు బొప్పన పూర్ణచంద్రారావు ఉన్నారు

హిందూ మతాన్ని కాపాడుకోవాలి

ఉంగుటూరు: దేవాలయాల ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన అవసరం హిందువులపై ఉందని కాకినాడ జిల్లా సోమేశ్వరానికి చెందిన అడబాల స్వామిజీ అన్నారు. ఆయన పాదయాత్ర చేసుకుంటూ గన్నవరం హైందవ శంఖారావానికి వెళుతూ ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఆగారు. అక్కడ స్వామీజి మాట్లాడుతూ భారతదేశం గొప్పతనం, పేరు ప్రతిష్టలు, సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్థానికులు చిలకంటి జయరాజు, నూకల రోహిత్, నూకల పవన్ తదిరులు స్వామిజీని సత్కరించారు.

నిత్యావసర సరుకులు అందజేత

దెందులూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గాలాయగూడెం గ్రామ వైఎస్సార్ సీపీ కార్యకర్త దర్శనపు రాకేష్ బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పార్టీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు స్ఫూర్తితో మృతుని కుటుంబానికి నిత్యావసర వస్తువులను అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని, తమ పూర్తి సహాయ సహకారాలు ఇస్తామని నాయకులు అన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తాచాటిన విద్యార్థులు



ప్రథమస్థానంలో నిలిచిన మంకీ గన్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో బాలయ్య

గణపవరం: దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (ఎస్ఐఎస్ఎఫ్)-2025 సందర్భంగా పిప్పర జెడ్పీస్కూల్లో గురువారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీల్లో జల్లికొమ్మర యూపీ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. 3 విభాగాలకు 2 విభాగాల్లో ఆ స్కూల్ విద్యార్థి నిమ్మల హనుమ రూపొందించిన మంకీ గన్‌కు ప్రథమ స్థానం లభించింది. టీచర్స్ కేటగిరిలో అదే స్కూల్ హెచ్ఎం కేటీ సుందరకుమార్ తయారు చేసిన లైన్ టెస్టర్ మోడల్ జిల్లాకు ఎంపికైందని ఎంఈవో-1 రాజేష్ తెలిపారు. గ్రూప్ కేటగిరిలో కొత్తపల్లి యూపీ స్కూల్ విద్యార్థులు కె. శ్రీదేవి, ఎం. తేజస్విని తయారు చేసిన ఆర్గానిక్ సిస్టమ్ ఇన్ హ్యూమన్ బాడీ గ్రూప్ కేటగిరికి జిల్లాకు ఎంపికై ఒదన్నారు. వరుసగా మరో 6 స్థానాల్లో ఉన్న ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 4న వీరవాసరం జెడ్పీ స్కూల్లో జిల్లాస్థాయి సదరన్ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులను పంపిస్తున్నట్లు ఎంఈవో-2 జి. బాలయ్య తెలిపారు. న్యాయనిర్ణేతలుగా ముగ్గురు హైస్కూల్ హెచ్ఎంలు వ్యవహరించారు.

వేంకటేశ్వర స్వామికి లక్ష తులసి పూజ



గుండుగొలను వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రీతికరమైన జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు చేసారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలోని స్వామి వారికి లక్ష తులసి పత్రాల పూజ, పూర్ణాహుతి పూజలు చేసారు. నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు, పెద్దలు కొండ గంగరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కుంగిన తూరలు.. తరచూ రోడ్డు ప్రమాదాలు

- నాలుగు నెలలైనా పట్టించుకోని పాలకులు
- బావాయిపాలెం టర్నింగ్ యమ డేంజర్
- భారీ వాహనాల రాకపోకలతో పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళనలో ప్రయాణికులు, స్థానికులు



బావాయిపాలెం- గణపవరం రోడ్డులో పగిలిన తూరపై భారీ వాహనాలు



గణపవరం - బావాయిపాలెం మార్గంలో కుంగిన రహదారి



పగిలిన తూరకు రైతులు సపోర్టుగా ఉంచిన కంకర బస్తాలు, హెచ్చరిక కర్ర



బావాయిపాలెం మార్గంలో ఆలుగోడు సెంటర్లో ప్రమాదకరంగా ఉన్న తూర

నిడమర్రు: బావాయిపాలెం అలుగోడు సెంటర్లో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు హడలి పోతున్నారు. గణపవరం నుంచి క్రొవ్విడి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి పలు చోట్ల కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. గణపవరం నుంచి బావాయిలెం మార్గం మలుపులో ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో, రోడ్డుకు ఇరువైపులా పంట కాలువ తూరలు పగిలిపోవడంతో రోడ్డు 20 అడుగుల నుంచి 8 అడుగులకు కుంచించుకుపోయింది. దీంతో ఆ మలుపులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డు మధ్యలో ఉన్న పంట కాలువ తూర పగిలి నాలుగు నెలలవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని బావాయిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో చీకట్లో ప్రయాణం మరింత ప్రాణాల మీదకు తెస్తోందని వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యలపై అనేక సార్లు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ ఎవరూ స్పందించలేదని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రమాదాల నివారణకు తాత్కాలిక ఏర్పాట్లు

పాలకులు, అధికారులకు నాలుగు నెలలుగా విన్నవించి విసిగిపోయిన బావాయిపాలెం గ్రామస్తులు ఆ రహదారిలో ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక నివారణ చర్యలు చేపట్టారు ఏర్పాట్లు చేసుకున్నారు. పగిలిపోతున్న తూరకు కంకర బస్తాలు సపోర్టుగా ఉంచారు. దీంతో కొంతమేర వాహనాల రాకపోకలకు అవకాశం ఏర్పడింది. స్థానిక యువకులు పగిలిన తూరకు ఇరువైపులా కంకర లోడు దింపి గుట్టలుగా ఉంచారు. చీకట్లో ప్రయాణికులను హెచ్చరించేలా కుంగిపోయిన తూరల వద్ద హెచ్చరిక జెండాలు పాతారు. అయినా ఇటీవల బొమ్మిలి వెంకటేశ్వరరావు, రావూరి శ్రీధర్, సత్యనారాయణ అనే ప్రయాణికులు ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో గాయపడినట్లు స్థానికులు చెపుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణం

వైఎస్సార్‌సీపీ హయాంలో 2022లో క్రొవ్విడి నుంచి గణపవరం వరకూ ఈ ఆర్అండ్‌బీ రహదారిని రూ.3 కోట్లు నిధులతో నిర్మించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ రహదారి నిర్వహణపై పాలకులు ఎటువంటి శ్రద్ధ చూపకపోవడంతో ఈ రోడ్డు రోజు రోజుకు ఛిద్రమవుతోంది. బావాయిపాలెం నుంచి క్రొవ్విడి శివారు వరకూ 3 చోట్ల ఈ రహదారి ఇరువైపులా కుంగిపోయినట్లు గ్రామ పెద్దలు చెపుతున్నారు. అధికారులు స్పందించి భారీ ప్రమాదాలు జరగక ముందే రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

తూర పగిలి నాలుగు నెలలు అవుతున్నా..



అలుగోడు మలుపులో రోడ్డు మధ్యలో సిమెంట్ తూర పగిలిపోయి నాలుగు నెలలు అవుతోంది. అప్పటి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తూర పగిలి రోడ్డు వెడల్పు రోజు రోజుకు కుంచించుకుపోతోంది. దీంతో ఇక్కడ తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వచ్చి చూసి వెళ్లారేగానీ నేటికీ నివారణ చర్యలు చేపట్టలేదు.
– గొర్రెల వెంకన్న, రైతు, బావాయిపాలెం

భారీ వాహనాల రాకపోకలతో ఆందోళన



నారాయణపురం నుంచి ఆకివీడు వెళ్లేందుకు ఇది దగ్గర మార్గం. దీంతో రోజూ వందలాది భారీ వాహనాలు ఈ మార్గంలోనే తిరుగుతుంటాయి. చినకాపవరం– రాజమండ్రి ఆర్టీసీ బస్‌తోపాటు 20 వరకూ స్కూల్ బస్సులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు రోజు రోజుకూ కోతకు గురవుతోంది. ఏ పెద్ద ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది.
– బత్తిన చిన్న, బావాయిపాలెం

కొవ్వలిలో వైభవంగా జనార్దనస్వామి ఊరేగింపు

దెందులూరు: కొవ్వలిలో జనార్దన స్వామి ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి ఆలయంలో భక్తులు ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో గ్రామంలోని వీధుల గుండా పల్లకిలో ఊరేగించారు. మేళ తాళాలతో ఊరేగింపు కార్యక్రమం ఘనంగా కొనసాగింది. భక్తులు, స్వామివారిని దర్శించుకుని పువ్వులు, పండ్లు కానుకలు అందజేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

జూదం, కోడి పందేల నిర్వాహకులపై కఠిన చర్యలు

ఉంగుటూరు: సంక్రాంతి సందర్భంగా పేకాట, గుండాట, కోడిపందేలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ హెచ్చరించారు. గురువారం కాకర్లమూడిలో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి లా అండ్ ఆర్డరు సమస్య వచ్చినా సహించేది లేదని తెలిపారు. సర్పంచి నాగు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి

పెదవేగి: అతివేగంగా వచ్చిన కారు మోటారు సైకిల్‌ను ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచాడు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయికి చెందిన వాక జితేంద్రకుమార్ 2024 డిసెంబర్ 28న వారి కుటుంబ సభ్యులతో కలిసి మోటార్ సైకిల్‌పై ఏలూరు దుస్తుల కొనుగోలుకు వెళుతుండగా ఏపీ 39 ఏఏ 1900 నంబర్ గల కారును డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి వెనుక నుంచి ఢీకొట్టినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జితేంద్రను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 2025 జనవరి 2న వాక జితేంద్రకుమార్ (59) మృతి చెందాడని ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

సీఐ సుభాష్‌ను సత్కరించిన ఎస్పీ



నిడమర్రు సీఐ సుభాష్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ కె.ప్రతాప్

నిడమర్రు: అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడుతున్న రాజస్థాన్‌కు చెందిన హేమందర్ సింగ్ (39)ను అత్యంత చాకచక్యంగా పట్టుకున్న నిడమర్రు సర్కిల్ సీఐ ఎంవీ సుభాష్ బృందాన్ని గురువారం జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కుమార్ రివార్డు, ప్రశంసాపత్రాలతో అభినందించారు. గురువారం నిందితుడు హేందర్‌సింగ్ నుంచి రూ.1.5 లక్షలు నగదు, మూడున్నర కాసుల బంగారు సూత్రాల తాడు, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుభాష్ తెలిపారు. బాదంపూడిలో జరిగిన చైన్ స్నాచింగ్‌పై అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సీఐ సుభాష్ బృందం పదిరోజులుగా సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితుడు ఆచూకీ కోసం రాజస్థాన్, హైదరాబ్, వరంగల్‌లో తిరిగి చేబ్రోల్ గేటు వద్ద హేమందర్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారు చూపిన ప్రతిభను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు నిడమర్రు సర్కిల్ పోలీసులు తెలిపారు. ఎస్పీ అభినందించిన వారిలో ఎస్సైలు వీరప్రసాద్, ఎ.మణికుమార్, సిబ్బంది సీహెచ్‌సీకే నాగరాజు, పీసీఎస్ నాగరాజు, ఎం రాజేశ్ ఉన్నారు.

రాట్నాలమ్మ సన్నిధిలో సింగర్ శ్రీలలిత దంపతుల పూజలు



రాట్నాలమ్మ సన్నిధిలో పూజలు చేస్తున్న సింగర్ శ్రీలలిత దంపతులు

పెదవేగి : రాట్నాలకుంటలో వేంచేసియున్న రాట్నాలమ్మను గురువారం సినీ సింగర్ శ్రీలలిత ఆమె భర్త సీతారాం దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలాపన చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుకు ఘన స్వాగతం

దెందులూరు: కొవ్వలి గ్రామస్తుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు స్వగృహానికి విచ్చేశారు. ఆయన సోదరులు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు గొల్ల వీరాస్వామి, గొల్ల కిరణ్ స్వాగతం ఆయనకు పలికారు. ఎంపీ గొల్ల బాబూరావు పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాశ్మీర్ రాష్ట్రానికి సమావేశాల నిమిత్తం ఆయన బయలుదేరి వెళ్లారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

దెందులూరు: దేవాలయాల రక్షణ కోసం ఈనెల 5న గన్నవరంలో నిర్వహించనున్న హైందవ శంఖారావానికి లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని దేవాలయాల పరిరక్షణ సేవా సంఘం సభ్యులు పెనుమాక వాసు కోరారు. గురువారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న సంస్థల సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.

రాష్ట్రస్థాయి కథల పోటీల్లో ప్రతిభ

ఉంగుటూరు: రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ మాసపత్రిక ఆధ్వర్యంలో ఉత్తమ కథల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో ఉప్పాకపాడు పాఠశాల ఉపాధ్యాయుడు అల్లు శ్రీను రచించిన వృద్ధుల దినోత్సవం కథకు మూడోస్థానం లభించింది. కాకినాడలో ఈ నెల 6న నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో నగదు బహుమతిని ఆయన అందుకోనున్నారు. అల్లు శ్రీనును గురువారం పలువురు అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుమతి తదితరులు

దెందులూరు: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. పోతునూరు గ్రామ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, సర్పంచ్ బోదులు స్వరూప్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులు ఇచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది కృషి చేస్తారని అన్నారు. పోతునూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఫిర్యాదులను తహసీల్దార్‌కు అందజేశారు. సమావేశంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్వో రామచంద్రరావు, గ్రామ కార్యదర్శి షరీఫ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ బొడ్డేటి మోహన్, పార్టీ మండల కార్యదర్శి నున్న లక్ష్మణ, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చలసాని రాంబాబు, రాంప్రసాద్, కోటేశ్వర రావు ఉన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ జట్టుకు దంత వైద్య విద్యార్థిని ఎంపిక



సౌత్ జోన్ మహిళల వాలీబాల్ జట్టుకు ఎంపికైన సహిస్త అంబ్రిన్‌ను అభినందిస్తున్న దృశ్యం

పెదవేగి : సౌత్ జోన్ మహిళల వాలీబాల్ జట్టుకు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి మోజెస్ గురువారం తెలిపారు. పెదవేగి మండలం దుగ్గిరాల దంత కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సహిస్త అంబ్రిన్, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల్లో నిర్వహించిన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఈ త్రిమూర్తి సారథ్యంలో సౌత్ జోన్ మహిళల వాలీబాల్ సెలెక్షన్‌లో విద్యార్థిని ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈమె జనవరి నెల 7 నుంచి 11వ తేదీ వరకు తమిళనాడులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ ఎస్ స్లీవ రాజు చెప్పారు. విద్యార్థిని, ఫిజికల్ డైరెక్టర్ ఎస్ నల్లయ్యను కరస్పాండెంట్ సెక్రెటరీ ఫాదర్ మోజెస్, ప్రిన్సిపాల్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్ సిబ్బంది అభినందించారు.

అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ్ వాటిక



అంగన్‌వాడీ సెంటర్లల్లో కిచెన్ గార్డెన్లు పరిశీలిస్తున్న పీడీ శారద, సీడీపీఓ విజయలక్ష్మి

దెందులూరు: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి భరోసాకు ప్రభుత్వం సంబంధిత గ్రామాల్లో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన నగదుతో పోషణ వాటి అభివృద్ధిపరిచే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు నిర్వహిస్తున్నారు. దెందులూరు మండలం దెందులూరులోని ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని టీచర్లు నిర్వహిస్తున్న పోషన్ వాటికను జిల్లా పీడీ శారద, పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న వాటికను వారు పరిశీలించారు. కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డెన్‌లో ఆకుకూరలను, కూరగాయలను పెంచి వాటిని వినియోగించడం వల్ల అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించవచ్చని పీడీ శారద, సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

ఎస్ఎంసీలను బలోపేతం చేయాలి



పెదవేగి జెడ్పీ హైస్కూల్లో ఎస్ఎంసీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 అరుణ్‌కుమార్

పెదవేగి : విద్యారంగంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, సంస్కరణల సాధన కోసం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లను బలోపేతం చేయాలని పెదవేగి ఎంఈఓ-2 అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి జెడ్పీ హైస్కూల్లో బుధవారం ఎస్ఎంసీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులకు ఎస్ఎంసీ కమిటీల బాధ్యతలు, విధులపై మండల స్థాయి శిక్షణ తరగతులను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ అకడమిక్, పరిపాలన వ్యవహారాల్లో ఎస్ఎంసీల సహకారంతో జిల్లాలోని పాఠశాలలను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత హెచ్ఎంపై ఉందన్నారు. ఎస్ఎంసీలతో పాటు ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వెయ్యాలన్నారు. బోధనను సామాజిక బాధ్యతగా తీసుకుని అక్షరాస్యతను పెంచాలన్నారు. విద్యతో పాటు విద్యార్థుల ప్రవర్తనను సంస్కరించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పాఠశాల హెచ్ఎంలు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తయారు చేయడానికి ఎస్ఎంసీ సభ్యులంతా బాధ్యతగా కృషి చేయాలని నిడమర్రు ఎంఈవో-1, ఎంఈవో-2 ఈదుపల్లి శ్రీనివాసరావు, భాస్కరకుమార్ అన్నారు. గురువారం నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఎస్ఎంసీ సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిడమర్రు హైస్కూలు హెచ్ఎం సుబ్బలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులకు సీఆర్పీలు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు కేవీ కృష్ణకుమార్, తోట అప్పారావు, సంకు ఏసుబాబు, యర్రంశెట్టి శేషగిరిరావు, పీఎన్ సత్యనారాయణ, బి.దంజు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఎస్ఎంసీ సభ్యులు కృషి చేయాలి

భీమడోలు: పాఠశాల యాజమాన్య కమిటీలు పాఠశాలల బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని జెడ్పీ సీఈవో సుబ్బారావు అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్య కమిటీల సభ్యులకు బాధ్యతలు, విధులు, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, సామాజిక తనిఖీలు, సమస్యలు వాటి పరిష్కారాలు, ప్రజా భాగస్వామ్యం వంటి అంశాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ సీఈవో సుబ్బారావు మాట్లాడుతూ ఎస్ఎంసీ సభ్యులు ప్రజాభాగస్వామ్యంలో పాఠశాలల్లోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎస్ఎంసీ కమిటి సభ్యులు తమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టారు. భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్, హెచ్ఎం బి.శ్రీనివాసరావు, ఈవోఆర్డీ ఏ.సుందరి, గ్రామకార్యదర్శి తనూజ, మాస్టర్ ట్రైనీలు వి.ఉపేంద్ర, షేక్ మస్తాన్, భీమారావులు, సీఆర్ ఎంటీలు సత్యప్రసాద్, రమణ, రాధాకృష్ణ, 44 ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంలు పాల్గొన్నారు.

శివారు భూములకు నీరందించాలి



ఉంగుటూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు: నియోజకవర్గంలో దాళ్వా పంటకు శివారు భూములు రైతులకు సైతం నీరందించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఈమేరకు ఇరిగేషన్ అధికార్లు, సాగునీటి సంఘాల ప్రతినిధులతో చర్చించి ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆయన అన్నారు. గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికార్లు సాగునీటి సంఘాల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగునీటికి, తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాగునీరు, సాగునీరు పారే కాలువల్లో కాలుష్య నివారణకు శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం ఇరిగేషన్ డీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉండి ఇరిగేషన్ డీఈ సత్యనారాయణమూర్తి, తాడేపల్లిగూడెం డ్రైన్స్ డీఈఈ వరప్రసాదు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రెడ్డి శివ, నీటి సంఘాల ప్రతినిధులు, రెవెన్యూ అధికార్లు, పిషరీస్ అధికార్లు, ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికార్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: చేబ్రోలులో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె.ఎం.అంబేద్కర్ తెలిపారు. 11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో చేబ్రోలు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. చేబ్రోలు పరిసర ప్రాంత రైతులకు విద్యుత్ శుక్రవారం ఉదయం 9 నుంచి 4 గంటల వరకు సరఫరా విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

నిడమర్రు: కొత్త సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో కృషి చేయాలని నిడమర్రు ఎంఈవో-1, 2 శ్రీనివాసరావు, భాస్కరకుమార్ అన్నారు. గురువారం నిడమర్రు ఎంఆర్సీ భవనంలో నూతన సంవత్సరం సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈవోలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేకు కోసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్టీయూ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బాలిన వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్లలో గురువారం ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ దూసనపూడి పుల్లయ్య, ఎంటీ గోపాలకృష్ణమూర్తి, ఎస్ఎఫ్ఏ అంబికా, ఎంటీ నిర్మల, రైతులు పాల్గొన్నారు.